శ్రీ సుబ్రహ్మణ్య భుజంగ స్తోత్రమ్ - భావార్థముతో.



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ సుబ్రహ్మణ్య భుజంగ స్తోత్రమ్ - భావార్థముతో.

శ్రీ ఆది శంకరాచార్యులు తిరుచెందూర్ (తమిళనాడు రాష్ట్రం) లో గల శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శ్రీ సుబ్రహ్మణ్యుని ధ్యానిస్తున్న సమయంలో వారి హృదయంలో మిక్కిలి తేజస్సుతో ఆత్మ ప్రకాశించగా, హఠాత్తుగ, అనూహ్యంగా వారి నోటినుండి వెలువడిన స్తోత్రమే "సుబ్రహ్మణ్య భుజంగం" . ఈ స్తోత్రంలో భక్తి, ఆత్మ ఔన్నత్యం, పరవశత, అనందం ప్రతిబింబిస్తాయి.

– – – = – – –

01. సదా బాలరూపాఽపి విఘ్నాద్రిహంత్రీ
మహాదంతి వక్త్రాఽపి పంచాస్యమాన్య।
విధీంద్రాది మృగ్యా గణేశాభిధా మే
విధత్తాం శ్రియం కాఽపి కల్యాణమూర్తిః॥

ఎల్లపుడు బాల రూపమున నున్నను, విఘ్న పర్వతముల భేదించు నదియు, గొప్ప గజముఖము గలదైనను పంచాన్యుని (సింహము - శివుడు) ఆదర పాత్రమును, బ్రహ్మ, యింద్రుడు మున్నగు వారిచే వెతుక దగినదియు గణేశుడను పేరు గల ఒకానొక మంగళరూపము నాకు సంపదను కలుగజేయు గాక!

ఎల్లప్పుడు బాలరూపముగా ఉన్ననూ కొండల వంటి విఘ్నములను పగులగొట్టునది, పెద్ద ఎనుగు ముఖము కలదైననూ సింహముచేత గౌరవింప దగినది, బ్రహ్మ ఇంద్రుడు మొదలగు దేవతలచే అన్వేషింపబడునది, "గణేశ" అను పేరు కలది అగు ఒక మంగళమూర్తి నాకు సంపదను కలిగించుగాక.

ఎల్లప్పుడూ బాల రూపమున నున్ననూ, విఘ్నపర్వతముల భేదించునదియు, గొప్ప గజముఖము గలదైనను పంచాన్యునికి (సింహము - శివుడు) ఆదర పాత్రమును, బ్రహ్మ, ఇంద్రుడు మున్నగువారిచే వెతుక దగినదియు (సాధన చేయదగినదియు) గణేశుడను పేరు గల ఒకానొక మంగళ రూపము నాకు సంపదలను కలుగజేయుగాక!

02. న జానామి శబ్దం న జనామి చార్థం
న జానామి పద్యం న జానామి గద్యమ్।
చిదేకా షడాస్య హృది ద్యోతతే మే
ముఖాన్నిః సరంతే గిరశ్చాపి చిత్రమ్॥

శబ్దార్థములను గాని, పద్య గద్యములను గాని నే నెఱుంగను. ఆరు ముఖములు గల యొకానొక చిద్రూపము నా మనస్సునందు ప్రకాశించు చున్నది. నా ముఖము నుండి వాక్కులు బయలుదేరు చున్నవి. ఇది యెంతయు చిత్రము!

నేను శబ్దమునెరుగను. అర్థము నెరుగను. పద్యము నెరుగను. గద్యము నెరుగను. ఆరుముఖములు కల చిద్రూపము ఒక్కటే నా హృదయము నందు వెలుగుచున్నది. నోటి నుండి చిత్రముగా మాటలు వెలువడుచున్నవి.

శబ్దార్థములనుగాని, పద్య గద్యములను గాని నే నెఱుంగను. ఆరు ముఖములు గల యొకానొక చిద్రూపము నా మనస్సునందు ప్రకాశించు చున్నది. నా ముఖమునుండి వాక్కులు బయలుదేరుచున్నవి. ఇది అంతయు చిత్రము.

03. మయూరాధిరూఢం మహావాక్యగూఢం
మనోహారి దేహం మహచ్చిత్త గేహమ్।
మహీదేవ దేవం మహావేద భావం
మహాదేవ బాలం భజే లోక పాలమ్॥

నెమలి నధిష్ఠించి యున్నవాడును, తత్త్వమస్యాది మహా వాక్యము లందు నిగూఢమై యున్నవాడును, మనోహరమైన దేహముగల వాడును, మహాత్ముల చిత్తము నందు వసించువాడును, మహాదేవుని సందనుడును, లోకమును రక్షించు వాడును నగు సుబ్రహ్మణ్యేశ్వరుని సేవింతును.

మయూర వాహనుడు, వేదాంత మహా వాక్యములలో నిగూఢముగా నున్నవాడు, మనోహరమైన దేహము కలవాడు, మహాత్ముల మనస్సు లందు నివశించువాడు, బ్రాహ్మణులచే ఆరాధించదగినవాడు, వేదముల భావమైనవాడు, ఈశ్వర పుత్రుడు, లోకపాలకుడు అగు సుబ్రహ్మణ్యస్వామిని సేవించు చున్నాను.

నెమలిని అధిష్ఠించి ఉన్నవాడును, మహావాక్యములందు (అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయంఆత్మా బ్రహ్మ - వీటియందు) నిగూఢమై యున్నవాడును, మనోహరమైన దేహము గలవాడును, మహాత్ముల చిత్తమునందు పసించువాడును, బ్రాహ్మణులకు ఆరాధ్యుడును, వేదములచే ప్రతిపాద్యుడును, మహాదేవుని పుత్రుడును, లోకమును రక్షించువాడును నగు సుబ్రహ్మణ్యేశ్వరుని సేవింతును.

04. యదా సంని(సన్ని)ధానం గతా మానవా మే
భవాంభోధిపారం గతాస్తే తదైవ।
ఇతి వ్యంజయం సింధూతీరే య ఆస్తే
తమీడే పవిత్రం పరాశక్తి పుత్రమ్॥

"నా సాన్నిధ్యమును పొందిన వేంటనే మనుజులు సంసార సాగరమును దాటుదురు" అని సూచించుచు, సముద్ర తీరమున నున్న పరాదేవత యొక్క పుత్రుడగు సుబ్రహ్మణ్యుని స్తుతింతును.

"మానవులు ఎప్పుడు నావద్దకు వచ్చిరో అప్పుడే సంసార సముద్రమును దాటి పోయిరి" అని తెలియబరచుచూ సాగర తీరమందున్న పవిత్రుడైన పరాశక్తి పుత్రుని స్తుతించు చున్నాను.

"నా సన్నిధానము పొందిన వెంటనే మనుజులు సంసార సాగరమును దాటుదురు" అని సూచించుదురు. సముద్ర తీరముననున్న పరదేవత పుత్రుడగు పవిత్రుడైన సుబ్రహ్మణ్యుని స్తుతింతును. ఈ శ్లోకములో తిరుచ్చెందుర్ లో ఉన్న సుబ్రహ్మణ్యుని ఆలయమును ప్రస్తావించారు.

05. యదాబ్ధేస్తరంగా లయం య(యా)ంతి తుంగా
స్తథైవాపదః సన్నిధౌ సేవతాం మే।
ఇతీవోర్మి పంక్తిర్నృణాం దర్శయంతం
సదా భావయే హృత్సరోజే గుహం తమ్॥

పెద్దవైన సముద్ర తరంగములు లయమును పొందినట్లు నా సన్నిధానమున సేవించు జనుల యాపదలు నశించును అని జనులకు తరంగ పంక్తులను చూపుచున్నట్లుగా నున్న ఆ కార్తికేయుని నిరంతరము నా హృదయ పద్మమున తలంతును.

"ఎగసిపడు సముద్ర తరంగములు నన్ను చేరి ప్రశాంతమగునట్లుగా నా వద్దకు వచ్చి సేవించువారి ఆపదలు నశించి పోవును" అని చెప్పునట్లుగా మానవులకు సముద్రతరంగములను చూపించుచున్న గుహుని నా హృదయ పద్మమునందు సదా భావించెదను.

పెద్దవిగా ఉన్న సముద్ర తరంగములు ఎలాగ లయము పొందుతాయో, అలాగే నా సన్నిధానమున సేవించు జనుల ఆపదలు నశించును. ఇలాగ జనులకు తరంగ పంక్తులను చూపుచున్నట్లుగా నున్న ఆ కార్తికేయుని నిరంతరము నా హృదయ పద్మమున తలంతును.

06. గిరౌ మన్నివాసే నరా యేఽధి రూఢా
స్తదా పర్వతే రాజతే తేఽధి రూఢాః।
ఇతీవ బ్రువంగంధ శైలాధి రూఢః
స దేవో ముదే మే సదా షణ్ముఖోఽస్తు॥

నా నివాస స్థానమగు పర్వతము నెక్కిన నరులు కైలాసము నధిష్ఠించ గలరు అని చెప్పుచున్న వానివలె గంధ శైలము(పర్వతము) నధిష్ఠించియున్న ఆ షణ్ముఖ దేవుడు నాకు సంతోషమును కలిగించు గాక!

"నేను నివసించు కొండపై ఎక్కిన మానవులు" వెండికొండపై ఎక్కినట్లే అని చెప్పుచున్నట్లుగా గంధమాదన పర్వతము నధిష్ఠించిన ఆ షణ్ముఖ దేవుడు ఎల్లప్పుడు నాకు సంతోషము నిచ్చుగాక.

నా నివాస స్థానమగు పర్వతము నెక్కిన నరులు కైలాసమును అధిష్ఠించగలరని చెప్పుచున్నవానివలె గంధశైలమును అధిష్ఠించియున్న ఆ షణ్ముఖుడు నాకు సంతోషము కలిగించుగాక!

07. మహాంభోధి తీరే మహాపాప చోరే
మునీంద్రానుకూలే సుగంధాఖ్య శైలే।
గుహాయాం వసంతం స్వభాసా లసంతం
జనార్తిం హరంతం శ్రయామో గుహం తమ్॥

మహా సాగర తీరమున గొప్ప పాపముల హరించునదియు, మునీశ్వరుల కావాసమును నగు గంధ శైలము నందు, గుహయందు తన కాంతితో ప్రకాశించుచు నివసించుచున్నవడను, జనుల బాధలను హరించు వాడను నకు కుమారస్వామిని సేవింతుము.

మహాసముద్ర తీరమునందున్నది, మహా పాపములను హరించునది, మునీంద్రులకు అనుకూలమైనది అగు గంధమాదన పర్వతము నందలి గుహలో నివసించుచూ, తన తేజస్సుతో ప్రకాశించుచూ, జనుల బాధను తొలగించుచున్న గుహుని ఆశ్రయించెదను.

మహా సాగర తీరమున గొప్ప పాపముల హరించునదియు, మునీశ్వరులు నివసించే గంధశైలమునందు, గుహయందు తన కాంతితో ప్రకాశించుచు నివసించున్నవాడును, జనుల బాధలను హరించువాడును నగు కుమారస్వామిని సేవింతును.

08. లసత్స్వర్ణగేహే నృణాం కామదోహే
సుమస్తోమసంఛన్న మాణిక్యమంచే।
సముద్యత్సహస్రార్క తుల్యప్రకాశం
సదా భావయే కార్తికేయం సురేశమ్॥

మనుజుల కోరికల నొసంగు కనక భవనమునందు పుష్ప సముదాయముచే గప్పబడిన రత్న పీఠముపై ఉదయించుచున్న సహస్రాదిత్యులతో సాటియైన వెలుగు గల దేవతా శ్రేష్ఠుడైన కుమారస్వామిని నిరంతరము తలంచెదను.

మానవుల కోర్కెలు దీర్చు స్వర్ణభవనములో, మాణిక్యములచే నిర్మించిన పూలపాన్పుపై, వేయి సూర్యుల కాంతితో ప్రకాశించుచున్న దేవ ప్రభువగు కార్తికేయుని ధ్యానించు చున్నాను.

మనుజుల కోరికలు తీర్చుచు, కనక భవనమునందు పుష్పసముదాయము చే కప్పబడిన రత్నపీఠముపై ఉదయించుచున్న సహస్ర ఆదిత్యులతో సాటియైన వెలుగు గల దేవతా శ్రేష్ఠుడైన ఆ కార్తికేయుని నిరంతరము తలంచెదను.

09. రణద్ధంసకే మంజులే౽త్యన్తశోణే
మనోహారి లావణ్య పీయూష పూర్ణే।
మనఃషట్పదో మే భవక్లేశ తప్తః
సదా మోదతాం స్కంద తే పాదపద్మే॥

ఓ కుమారస్వామీ! సంసారము నందలి కష్టములచే తపింప చేయబడిన నా మనస్సనెడి తుమ్మెద - శబ్దించుచున్న అందెలతో మనోహరమైన లావణ్యామృతముతో నిండియున్న నీ పాదపద్మమునందు నిరంతరము ఆనందించు గాక!

హంసల కూతల వలే ధ్వనించు అందెలు కలది, అందమైనది, ఎఱ్ఱనిది, మనోహర లావణ్యముతో నిండినది, అగు నీ పాదారవిందము నందు సంసారబాధలతో తపించుచున్న నా మనస్సు అను తుమ్మెద ఎల్లప్పుడు ఆనందించు గాక.

స్కందా! సంసారమునందలి కష్టములచే తపింపజేయబడిన నా మనస్సనెడి తుమ్మెద - మ్రోగుచున్న ఆందెలతో, మనోహరమై అతియెఱ్ఱనిదైన లావణ్యా మృతముతో నిండియున్న నీ పాదపద్మములయందు నిరంతరము తృప్తి చెందుగాక.

10. సువర్ణాభ దివ్యాంబరైర్భాసమానం
క్వణత్కింకిణీ మేఖలా శోభమానామ్।
లసద్ధేమపట్టేన విద్యోతమానం
కటిం భావయే స్కంద తే దీప్యమానామ్॥

ఓ కుమారస్వామీ! బంగారము వంటి కాంతి గల దివ్య వస్త్రముల తోను, శబ్దించుచున్న చిరు గంటలు గల మొలనూలుతోను, ప్రకాశించుచున్న బంగారపు పట్టెతోను, ప్రకాశించుచున్న నీ యొక్క కటి ప్రదేశమును ధ్యానింతును.

ఓ స్కందుడా! బంగారు కాంతి కల దివ్య వస్త్రములను ధరించినది, మ్రోగుచున్న చిరుమువ్వలు పొదగిన మొలత్రాడుతో శోభిల్లుచున్నది. బంగారు పట్టాతో మెరయుచున్నది అగు నీ నడుమును ధ్యానించుచున్నాను.

కుమారస్వామీ! బంగారమువంటి కాంతి గల దివ్య వస్త్రములతోను, మ్రోగుచున్న చిరు గంటలుగల మొలనూలితోను, ప్రకాశించుచున్న సువర్ణపు పట్టెతోను వెలుగొందుచున్న నీ కటిప్రదేశమును ధ్యానింతును.

11. పులిందేశ కన్యా ఘనాభోగ తుంగ
స్తనాలింగనాసక్త కాశ్మీర రాగమ్।

నమస్యామహం తారకారే తవోరః
స్వభక్తావనే సర్వదా సానురాగమ్॥

తారకాసురుని సంహరించిన సుబ్రహ్మణ్య దేవా! పుళింద కన్య యగు వల్లీదేవి యొక్క ఉన్నతములైన ఔమ్ముల యాలింగనముచే లగ్నమైన కుంకుమచే నెర్రనైనదియు, నిజ భక్తుల రక్షణమున నెల్లప్పుడు ఆసక్తిగల నీ వక్షస్థలమును నమస్కరింతును.

తారకాసురుని సంహరించిన ఓ స్వామీ! కిరాత కన్య యగు వల్లీదేవి కౌగలించుకొనుట వలన కుంకుమతో ఎర్రనైనది, స్వభక్తులను రక్షించుటలో సర్వదా అనురాగము కలది అగు నీ వక్షస్థలమునకు నేను నమస్కరించెదను.

తారకాసురుని సంహరించిన ఓ దేవా! పుళింద కన్యయగు వల్లీ దేవి ఉన్నతములైన ఔమ్ముల యాలింగనముచే అంటిన కుంకుమచే నెర్రనైనదియు, నిజ భక్తుల రక్షణమున నెల్లప్పుడు ఆసక్తిగల నీ వక్షస్థలమును నమస్కరింతును.

12. విధౌ క్లృప్త దండాన్ స్వలీలాఘృ(ధృ)తాండా
న్ని రస్తేభ శుండాన్ ద్విషత్కాల దండాన్।
హతేంద్రారిషండాంజ గత్రాణ శౌండాన్
సదా తే ప్రచండాన్ శ్రయే బాహు దండాన్॥

ఓ స్వామీ! కర్తవ్యాచరణమున శిక్షితములును, అనాయాసముగ ధరింపబడిన బ్రహ్మాండములు గలవియు, గజ తుండముల నిరసించు చున్నవియు, విరోధులకు కాలదండముల వంటివియు, రాక్షస సముదాయముల పరిమార్చినవియు జగద్రక్షణ సమర్థములును భయంకరములును నగు నీ బాహు దండములను నాశ్రయింతును.

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

విధిని కూడ దండించునవి, బ్రహ్మాండమును మోయుచున్నవి, ఏనుగుల తొండముల కంటే బలమైనవి, శత్రువులకు యమదండములైనవి, రాక్షసులను సంహరించునవి. లోకములను రక్షించునవి ప్రచండమైనవి అగు నీ బాహుదండములను ఎల్లప్పుడు ఆశ్రయించుచున్నాను.

ఓ స్వామీ! కర్తవ్యాచరణమున శిక్షితములును, అనాయాసముగ ధరింపబడిన బ్రహ్మాండములు గలవియు, గజతుండముల నిరసించు చున్నవియు, విరోధులకు కాలదండముల వంటివియు, రాక్షస సముదాయముల పరిమార్చినవియు జగద్రక్షణ సమర్థములును, భయంకరములు నగు నీ బాహుదండముల నాశ్రయింతును.

13. సదా శారదాః షణ్మృగాంకా యది స్యుః
సముద్యంత ఏవ స్థితాశ్చేత్సమంతాత్।
సదా పూర్ణబింబాః కలంకైశ్చ హీనా
స్తదా త్వన్ముఖానాం బ్రువే స్కంద సామ్యమ్॥

ఓ కుమారస్వామీ! చంద్రులు ఎల్లపుడును శరచ్చంద్రులు గను, ఆరు సంఖ్య గలవారుగను, ఉదయించు చున్నవారుగను, పూర్ణబింబోపేతులుగను, కళంక శూన్యులుగను నుందురేని అపుడు నీ ముఖములతో పొలికను చెప్పుదును.

శరదృతువు నందలి ఆరు చంద్ర బింబములు ఎల్లప్పుడు అంతటా ప్రకాశించుచూ పూర్ణబింబములై కళంకము లేనివైనచో, ఓ స్కందుడా! నీ ముఖములతో సమానమని చెప్పెదను.

ఓ స్కందా! దేవా! చంద్రులు ఎల్లప్పుడును శరచ్చంద్రులు గను, ఆరు సంఖ్యగలవారుగను, ఉదయించు చున్నవారుగను, పూర్ణబింబోపేతులుగను, కళంకశూన్యులుగను నుందురేని అపుడు నీ ముఖములతో పోలికను చెప్పుదును.

14. స్ఫురన్మందహాసైః సహంసాని చంచ
త్కటాక్షావలీ భృంగ సంఘోజ్జ్వలాని।
సుధాస్యంది బింబాధరణీశ సూనో
తవాలోకయే షణ్ముఖాంభోరుహాణి॥

ఓ శివకుమారా! చిరు నవ్వులనెడి హంసలతోను క్రీగంటి చూపులనెడి తుమ్మెదలతోను ప్రకాశించు చున్నవియు, అమృతము స్రవించు దొండపండు వంటి పెదవులతో నొప్పారు నీ యొక్క ఆరు ముఖములనెడి పద్మములను దర్శింతును.

ఓ షణ్ముఖా! చిరునవ్వులు అను హంసలు, చంచలమైన కటాక్షములు అను తుమ్మెదలు, అమృతము స్రవించు పెదవులు - కల నీ ముఖములు అను పద్మములను దర్శించు కొనుచున్నాను.

ఓ శివ కుమారా! చిరునవ్వులనెడి హంసలతోను, క్రీగంటి చూపులనెడి తుమ్మెదలతోను, ప్రకాశించు చున్నవియు, అమృతము స్రవించు దొండపండువంటి పెదవులతో నొప్పారు నీ ఆరు ముఖములనెడి పద్మములను దర్శింతును.

15. విశాలేషు కర్ణాంత దీర్ఘేష్వజస్రం
దయాస్యందిషు ద్వాదశస్వీక్షణేషు।
మయీషత్కటాక్షః సకృత్పాతితశ్చే
ద్భవేత్తే దయాశీల కా నామ హానిః॥

దయాశీలుడా! విశాలములను, కర్ణాంత పర్యంత దీర్ఘములును నగు నీ యొక్క పన్నెండు నేత్రములు దయను వర్షించు చుండగా, నీ మంద కటాక్షము నాపై నొక పర్యాయము ప్రసరింప జేసెదవేని నీకు హాని యేమి?

విశాలమైనవి, చెవుల వరకు వ్యాపించినవి ఎల్లప్పుడు దయ నొలికించునవి అగు నీ పన్నెండు కన్నులలోని కటాక్షము కొంచెముగా నా పై ఒక్కసారి ప్రసరించినచో, ఓ దయాశీలుడా! నీకేమి నష్టము?

దయాశీలుడా! విశాలములును, కర్ణాంత పర్యంత దీర్ఘములును నగు పన్నెండు నేత్రములు దయను పర్షించుచుండగా, నీ మంద కటాక్షము నాపై నొక పర్యాయము ప్రసరించెదవేని నీకేమి తక్కువ యగును?

16. సుతాంగో(ద్భ)వో మేఽసి జీవేతి షడ్ధా
జపన్మంత్ర మీశో ముదా జిఘ్రతే యాన్।
జగద్భార భృద్భ్యో జగన్నాథ తేభ్యః
కిరీటోజ్జ్వలేభ్యో నమో మస్తకేభ్యః॥

కుమారా! చిరంజీవ! అని ఆరు పర్యాయము లుచ్చరించి శివుడు ఆఘ్రాణించు ననియు, జగద్భారమును నిర్వహింప సమర్థములును, కిరీటములచే ప్రకాశించుచున్న నీ తలలకు ఓ జగన్నాథా! నమస్కారము.

ఓ కుమారా! నీవు నాశరీరము నుండి పుట్టితివి. "చిరంజీవ" అని ఆరుసార్లు మంత్రమును చదువుచూ శివుడు ఏ ఆరుతలలపై ఆఘ్రాణించునో, ఓ జగన్నాథా! ప్రపంచ భారమును మోయునవి, కిరీటములతో ప్రకాశించునవి అగు నీ శిరస్సులకు నమస్కారము.

కుమారా! చిరంజీవ! అని ఆరు పర్యాయములుచ్చరించి శివుడు ఆఘ్రాణించు నవియు, జగద్భారమును నిర్వహింప సమర్థములును, కిరీటములచే ప్రకాశించు చున్నవియు నగు నీ తలలకు ఓ జగన్నాథా! నమస్కారము.

17. స్ఫురద్రత్న కేయూర హారాభిరామః
శ్చలత్కుండల శ్రీలసద్గండభాగః।

కటౌ పీతవాస(సా)ః కరే చారుశక్తిః
పురస్తాన్మమాస్తాం పురారేస్తనూజః॥

మణిమయ కేయూరములతోను, ముత్యాల హారములతోను మనోహరమైన వాడును, చలించుచున్న కుండల కాంతిచే ప్రకాశించు చెక్కిళ్ళు గలవాడును, నడుమున పీత వస్త్రము, హస్తమున మనోహరమగు శక్తియు గల శివనందనుడగు కుమారస్వామి నా ముందు ఉండుగాక!

కాంతివంతమైన రత్నకంకణములతో, హారములతో అందముగా నున్నవాడు, కుండలముల కాంతి ప్రసరించుచున్న చెంపలు కలవాడు, నడుము నందు పట్టు వస్త్రమును, చేతిలో 'శక్తి' అను ఆయుధమును ధరించిన శివుని కుమారుడు నా ఎదుట నిలుచుగాక.

మణిమయ కేయూరములతోను, ముత్యాల హారములతోను మనోహరమైన వాడును, చలించుచున్న కుండల కాంతిచే ప్రకాశించు చెక్కిలి గలవాడును, నడుమున పీత వస్త్రము, హస్తమున మనోహరమగు శక్తియు గల శివనందనుడగు కుమారస్వామి నా ముందు కలిపించు.

18. ఇహాయాహి వత్సేతి హస్తాన్ప్రసార్యా
హ్వయత్యాదరాచ్ఛంకరే మాతురంకాత్।
సముత్పత్య తాతం శ్రయంతం కుమారం
హరాశ్లిష్టగాత్రం భజే బాల(క)మూర్తిమ్॥

"బిడ్డా! ఇటు రమ్ము" అని చేతులను చాచి ఆదరముతో శంకరుడు పిలుచు చుండగా తల్లి యొడి నుండి దూకి తండ్రి నాశ్రయించి వానిచే కౌగలించు కొనబడిన శరీరము గల బాల సుబ్రహ్మణ్యమూర్తిని సేవింతును.

వత్సా! ఇటురమ్ము. అని శంకరుడు చేతులు చాచి ప్రేమతో పిలువగా అమ్మ ఒడినుండి దూకి తండ్రిని చేరి శివునిచే కౌగలించుకొనబడిన బాల స్వరూపుడగు కుమారస్వామిని సేవించుచున్నాను.

"బిడ్డా! ఇటు రమ్ము" - అని చేతులుచాచి ఆదరముతో శంకరుడు పిలుచు చుండగా తల్లి యొడినుండి దూకి తండ్రి నాశ్రయించి వానిచే కౌగలించుకొనబడిన శరీరము గల బాలసుబ్రహ్మణ్య మూర్తిని సేవింతును.

19. కుమారేశసూనో గుహ స్కంద సేనా
పతే శక్తిపాణే మయూరాధిరూఢ।
పులిందాత్మజా కాంత భక్తార్తి హారిన్
ప్రభో తారకారే సదా రక్ష మాం త్వమ్॥

కుమారస్వామీ! ఈశపుత్రా! గుహా! స్కందా! దేవసేనాపతీ! శక్తి యను ఆయుధము హస్తమునందు గలవాడా! నెమలి నెక్కినవాడా! వల్లీ నాథా! భక్తుల బాధలు తీర్చునట్టి ప్రభూ! తారకాసురుని సంహరించిన సుబ్రహ్మణ్యా! నన్నెల్లపుడు రక్షించుము!

ఓ కుమారస్వామీ! ఈశ్వరపుత్రుడా! గుహుడా! స్కందుడా! దేవసేనాపతీ! చేతిలో శక్తిని ధరించినవాడా! నెమలి నెక్కినవాడా! వల్లీనాయకుడా! భక్తుల పీడలను తొలగించువాడా! ప్రభూ! తారకాసురుని సంహరించినవాడా! నీవు ఎల్లప్పుడు నన్ను రక్షించుము.

కుమారస్వామీ! ఈశపుత్రా! గుహా! స్కందా! దేవసేనాపతీ! శక్తియను ఆయుధము హస్తమునందు గలవాడా! నెమలినెక్కినవాడా! వల్లీనాథా! భక్తుల బాధలు తీర్చునట్టి ప్రభూ! తారకాసురుని సంహరించిన సుబ్రహ్మణ్యా! నన్నెల్లప్పుడూ రక్షించుము.

20. ప్రశాంతేంద్రియే నష్టసంజ్ఞే విచేష్టే
కఫోద్గాఇ(రి)వక్త్రే భయోత్కంపిగాత్రే
ప్రయాణోన్ముఖే మయ్యనాథే తదానీం
ద్రుతం మే దయాలో భవాగ్రే గుహ త్వమ్

ఇంద్రియములు చేష్టలుడిగి, స్మృహతప్పి, ముఖము కఫమును గ్రక్కుచుండ, శరీరము భయముచే కంపించుచుండ దిక్కులేక నేను ప్రాణ ప్రయాణమునకు సిద్ధుడనై యుండగా దయా స్వభావము గల కుమారస్వామీ! నీవు నా యెదుట నుందువు గాక!

ఇంద్రియములు పనిచేయక, చైతన్యము నశించి, చేష్టలుడిగి, నోటిలో కఫము కారుచూ, భయముతో శరీరము వణుకు చుండగా అనాథయగు నేను మరణమునకు సిద్ధమైనప్పుడు దయామయుడగు ఓ గుహుడా! నా ముందు నిలువుము.

ఇంద్రియములు నియంత్రణ కోల్పోయి, స్మృహతప్పి, ముఖము కఫమును గ్రక్కుచుండ, శరీరము భయముచే కంపించుచుండ దిక్కులేక నేను ప్రాణ ప్రయాణమునకు సిద్ధుడనై యున్నవేళ (అంటే నా ప్రాణము పోయే ముందు) దయాస్వభావము గల కుమారస్వామీ! నీవు నా యెదుట నుందువు గాక!

21. కృతాంతస్య దూతేషు చండేషు కోపా
ద్దహ చ్ఛి(ంధి భింధీతి)న్ధ్ధి తి మాం తర్జయత్సు
మయూరం సమారుహ్య మా భైరితి త్వం
పురః శక్తిపాణిర్మమాయాహి శీఘ్రమ్॥

భయంకరులైన యమదూతలు కోపముతో "కాల్చుము! భేదించుము" అని బెదిరించుచుండగా శ్రీఘ్రముగ నీవు నెమలి నెక్కి, శక్తిని చేతగొని నా యెదకు రమ్ము!

"కాల్చుము, నరకుము, పగుల గొట్టుము" అని ప్రచండులగు యమదూతలు కోపముతో నన్ను బెదిరించుచుండగా భయము లేదని ఓదార్చుచూ, నెమలి నెక్కి శక్తి ధరించి వేగముగా నా ఎదుటకు నీవు రమ్ము.

భయంకరులైన యమదూతలు కోపముతో కాల్చు! చీల్చు! అని బెదిరించుచుండగా శీఘ్రముగా నీవు నెమలినెక్కి శక్తి చేతగొని "భయపడకు" అని అభయమునొసగుచూ నా యెదుటకు రమ్ము.

22. ప్రణమ్యాసకృత్పాదయోస్తే పతిత్వా
ప్రసాద్య ప్రభో ప్రార్థయేఽనేకవారమ్।
న్ వక్తుం క్షమోఽహం తదానీం కృపాబ్ధే
న కార్యాన్తకాలే మనాగప్యుపేక్షా॥

కృపా సముద్రుడా! ప్రభో! అనేక పర్యాయములు నీ పాదములపై బడి నమస్కరించి బ్రతిమాలుకొని ప్రార్థించుచున్నాను. అపుడు నేను మాట్లాడజాలను. నా అవసాన కాలమునందు ఏ మాత్రమును ఉపేక్షింపకుము!

ఓ ప్రభూ! అనేక పర్యాయములు నీ కాళ్లపై పడి నమస్కరించి అనుగ్రహింప చేసుకొని పలుమార్లు ప్రార్థించు చున్నాను. మరణము దరిచేరునప్పుడు నేను మాట్లాడలేను. ఓ దయామయుడా! నా మరణ కాలమున కొంచెము కూడ ఉపేక్ష చెయ్యవద్దు.

కృపా సముద్రుడా! ప్రభో! అనేక పర్యాములు నీ పాదములపై బడి నమస్కరించి బ్రతిమాలుకొని ప్రార్థించు చున్నాను. అప్పుడు నే మాట్లాడలేను. నా అవసాన కాలమునందు ఏ మాత్రమును ఉపేక్షింపకుము!

23. సహస్రాంద(సహస్రాణ్డ) భోక్తా త్వయా శూరనామా
హతస్తారకః సింహవక్త్రశ్చ దైత్యః।

మమాంతర్హృదిస్థం మనఃక్లేశమేకం
న హంసి ప్రభో కిం కరోమి క్వ యామి॥

ఓ ప్రభో! నీచే - అనేక బ్రహ్మాండముల కబళించిన శూరుడను పేరుగల తారకుడు, సింహ ముఖుడు అను రాక్షసులు - చంపబడిరి. నా హృదయా న్తరాళమున నున్న మానసికబాధ నొక్క దానిని నీవేల నశింపజేయవు? ఏమి చేయుదును? ఎచటికి పోదును?

వేలాది బ్రహ్మాండముల ననుభవించు శూరుడు, తారకుడు, సింహవక్త్రుడు అను రాక్షసులు నీచేత చంపబడిరి. ఓ ప్రభూ! నాహృదయమందున్న ఒక్క మానసిక కష్టమును నశింపచేయలేక పోతివి. ఏమి చేయుదును? ఎచటకు పోవుదును?

ఓ ప్రభో! నీ చే అనేక బ్రహ్మాండముల కబళించిన శూరుడను పేరుగల తారకుడు, సింహముఖుడు అను రాక్షసులు చంపబడిరి. నా హృదయాన్తరాళమున నున్న మానసిక బాధ నొక్కదానిని నీవేల నశింపజేయవు? ఏమి చేయుదును? ఎచటికి పోదును?

24. అహం సర్వదా దుఃఖభారావసన్నో
భవాందీన బంధుస్త్వ దన్యం న యాచే।
భవద్భక్తిరోధం సదా క్లృప్తబాధం
మమాధిం ద్రుతం నాశయోమాసుత త్వమ్॥

ఓ పార్వతీ నందనా! నే నెల్లపుడు దుఃఖ భారముచే క్రుంగితిని. నీవు దీనులకు బన్ధువు. నీ కంటె నిరతుని ప్రార్థించను. నీ భక్తికి ఆటంకమైనదియు, ఎల్లప్పుడు బాధలతో నిండినదియు నగు నా మానసిక వ్యధను నీవు నశింప జేయుము.

నేను ఎల్లప్పుడు దుఃఖభారముచే కృశించి పోవుచున్నాను. నీవు దీనబాంధవుడవు. నీకంటే ఇతరులను నేను యాచించను. నీపై భక్తిని అడ్డుకొనుచూ, సదా బాధపెట్టుచున్న నా మనోవ్యధను ఓ ఉమాసుతాడా! నీవే పోగొట్టుము.

పార్వతీనందనా! నే నెల్లప్పుడూ దుఃఖభారముచే క్రుంగి యుంటిని. నీవు దీనులకు బంధువు. నీకంటే ఇతరులని ప్రార్థింపను. నీ భక్తికి అటంకమైనదియు, ఎల్లప్పుడూ బాధలతో నిండినదియు నగు నా మానసిక వ్యధను నీవు నశింప జేయుము.

25. అపస్మార కుష్టక్షయార్శః ప్రమేహ
జ్వరోన్మాదగుల్మాదిరోగా మహంతః।
పిశాచాశ్చ సర్వే భవత్పత్రభూతిం
విలోక్య క్షణాత్తరకారే ద్రవంతే॥

తారకాసురవైరీ! స్మృతి తప్పుట, కుష్ఠ, క్షయ, మూలరోగము, ప్రమేహము, జ్వరము, చిత్త చాంచల్యము, గుల్మములు మొదలగు గొప్ప రోగములు, సమస్త పిశాచములు నీ ఆలయంలో (తిరుచ్చందూరు) లభించే పవిత్ర విభూతిని చూచిన క్షణకాలములో తొలగిపోవును.

అపస్మారము, కుష్ఠము, క్షయ, మూల వ్యాధి, మేహము, జ్వరము, పిచ్చి గుల్మము మొదలైన మహారోగములు అన్ని విధములగు పిశాచములు ఓ తారకారీ! నీ పాద ప్రభావమును చూచి క్షణములో పారిపోవుచున్నవి.

తారకాసురవైరీ, స్మృతి తప్పుట, కుష్ఠ, క్షయ, మూలరోగము, ప్రమేహము, జ్వరము, చిత్త చాంచల్యము, గుల్మలము మొదలగు గొప్ప రోగములు, సమస్త పిశాచములు నీ దగు వాహనము రాకను చూచి క్షణకాలములో పారిపోవును.

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

26. దృశి స్కందమూర్తిః శుతౌ స్కందకీర్తిః
ర్ముఖే మే పవిత్రం సదా తచ్చరిత్రమ్।
కరే తస్య కృత్యం వపుస్తస్య భృత్యం
గుహే సంతు లీనా మమాశేష భావాః॥

నా దృష్టియందు కుమారస్వామి యాకృతియు, నా చెవియందు వాని కీర్తియు, నా ముఖమునందు ఎల్లప్పుడు పవిత్రమైన ఆ కుమారస్వామి చరితము, నా చేతియందు వానికి సంబంధించిన కృత్యము, నా శరీరమున వాని దాస్యము ఈ విధముగ మదీయ సమస్త భావములు కుమారస్వామి యందు లీనములగుగాక!

నా దృష్టియందు స్కందుని దివ్యమూర్తి, చెవులయందు స్కందుని కీర్తి, నోటి యందు ఎల్లప్పుడు పవిత్రమైన ఆయన చరిత్ర, చేతులయందు ఆయన సేవ ఉన్నవై, శరీరము ఆయనకు దాసియై నా ఆలోచనలన్నీ ఆ గుహాయందు లీనమగుగాక.

నా దృష్టియందు కుమారస్వామి యాకృతి ఉండాలి. నా చెవి ఆతని కీర్తి వినాలి. నా ముఖము ఎల్లప్పుడూ పవిత్రమైన ఆ కుమారస్వామి చరితము పాడాలి. నేను ఆతనికి సంబంధించిన సేవలు చేయాలి. నా శరీరము వాని దాస్యము చేయాలి. ఈ విధముగ సమస్త భావములు కుమారస్వామియందు లీనము అవ్వాలి.

27. మునీనాముతాహో నృణాం భక్తిభాజా
మభీష్టప్రదాః సంతి సర్వత్ర దేవాః।
నృణామంత్య జానా మపి స్వార్థదానే
గుహాద్దేవమన్యం న జానే న జానే॥

మునులకు గాని లేక భక్తి పరులగు నరులకు గాని వాంఛితముల నొసంగు దేవులంతట గలరు. కాని అంత్యవర్ణ సంజాతులగు మానవులకు గూడ

నిజాభీష్టముల నొసంగుటయందు కుమారస్వామి కంటె వేరు దైవమును నేనెఱుంగను. నే నెఱుంగను.

మునులకు, భక్తులకు కోరిన కోర్కెలు తీర్చు దేవతలు అంతటా ఉన్నారు. అల్పజాతుల వారికి కూడ కోరినవి ఇచ్చు దేవుడు గుహుని కంటే వేరొకడు లేడు.

మునులకు గాని, భక్తులకు గాని కోరికలు తీర్చు దేవుళ్ళు అంతటా గలరు. కాని అంత్యవర్ణ సంజాతులగు సామాన్య మానవులకు గూడ నిజాభీష్టముల నొసంగుటకు కుమారస్వామి కంటే వేరు దైవమును నే నెఱుంగను. నే నెఱుంగను.

28. కళత్రం సుతా బంధువర్గః పశుర్వా
నరో వాథ నారి గృహే యే మదియాః।
యజంతో నమంతః స్తువంతో భవంతం
స్మరంతశ్చ తే సంత సర్వే కుమార॥

ఓ కుమారస్వామీ! నా భార్య, బిడ్డలు, బంధువులు, పశువుగాని, మా ఇంటియందున్న నా సంబంధమైనవారు మగవాడుగాని, ఆడదిగాని, అందరు నిన్ను పూజించువారుగను, నీకు నమస్కరించు వారుగను, నిన్ను స్తుతించు వారుగను, నిన్ను స్మరించు వారుగను నుందురుగాక!

భార్యకానీ, పుత్రులుకానీ, బంధువులుకానీ, పశువులుకానీ, పురుషుడుకానీ, స్త్రీకానీ, నావారెవరైతే ఇంటి యందున్నారో వారందరూ, ఓ కుమారస్వామీ! నిన్ను పూజించు వారుగానూ, నమస్కరించు వారుగానూ, స్మరించు వారుగానూ ఉండుగాక.

ఓ కుమారస్వామీ! నా భార్య, బిడ్డలు, బంధువులు, పశువు గాని, మా ఇంటియందున్న నా సంబంధమైన వారు మగవారు గాని, ఆడవారు గాని అందరూ నిన్ను పూజించు వారుగను, నీకు నమస్కరించు వారుగను నిన్ను స్తుతించు వారుగను, నిన్ను స్మరించు వారుగను నుందురుగాక!

29. మృగాః పక్షిణో ద(ం)శకా యే చ దుష్టా
స్తథా వ్యాధయో బాధకా యే మదంగే।
భవచ్ఛక్తి తీక్ష్ణాగ్రభిన్నాః సుదూరే
వినశ్యంతు తే చూర్ణిత క్రౌంజశైల॥

క్రౌంచ పర్వతమును చూర్ణము చేసిన కుమారస్వామీ! నా శరీరమును బాధించు మృగములు గాని, పక్షులు గాని, దుష్టములైన అడవి యీగలు గాని, వ్యాధులు గాని, నీదగు శక్తి యనెడి ఆయుధము యొక్క వాడియైన కొనచే భేదింప బడినవై మిక్కిలి దూరముగా నశించుగాక!

నా శరీరమును హింసించు మృగములు, పక్షులు, కాటువేయు ప్రాణులు, బాధించు రోగములు మొదలైనవన్నీ, ఓ క్రౌంచ పర్వతమును పిండి చేసిన వాడా! నీ శక్తి అను ఆయుధము యొక్క పదునైన మొనచే దూరము నందే నశించుగాక.

క్రౌంచ పర్వతమును చూర్ణము చేసిన కుమారస్వామీ! నా శరీరమును బాధించు మృగములు గాని, పక్షులు గాని, దుష్టములైన అడవి యీగలు గాని, వ్యాధులు గాని, నీ శక్తి ఆయుధము యొక్క వాడియైన కొనచే ముక్కలైనవై మిక్కిలి దూరముగ పడి నశించగాక!

30. జనిత్రీ పితా చ స్వపుత్రాపరాధం
సహేతే న కిం దేవసేనాధినాథ।
అహం చాతిబాలో భవాన్ లోకతాతః
క్షమస్వాపరాధం సమస్తం మహేశ॥

దేవ సేనాపతీ! తల్లిగాని, తండ్రిగాని తన బిడ్డ యొక్క అపరాధమును క్షమింపరా? నేను మిక్కిలి బాలుడను. నీవు లోకపితవు. కావున మహాప్రభూ! నా సమస్తాపరాధమును క్షమింపుము!

ఓ దేవసేనాపతీ! తల్లిదండ్రులు తమ పుత్రుని అపరాధమును మన్నించరా ఏమి? నేను చిన్న బాలుడను. నీవు లోకములకే తండ్రివి. ఓ మహేశా! నా అపరాధములన్నింటినీ క్షమించుము.

దేవసేనాపతీ! తల్లి గాని తండ్రి గాని తన బిడ్డ అపరాధమును క్షమింపరా? నేను మిక్కిలి బాలుడను. నీవు లోకపితవు. కావున మహాప్రభూ! నా సమస్త అపరాధములనూ క్షమింపుము.

31. నమః కేకినే శక్తయే చాపి తుభ్యం
నమసశ్ఛాగ తుభ్యం నమః కుక్కుటాయ।
నమః సింధవే సింధుదేశయ తుభ్యం
పునః స్కందమూర్తే నమస్తే నమోఽస్తు॥

కుమారస్వామీ! నీ వాహన మగు నెమలికి, నీ యాయుధమగు శక్తికి, నీకు, నీ మేకపోతునకు, నీ ధ్వజమగు కోడికి నమస్కారము. నీవు వసించు సింధు దేశమునకు, సముద్రమునకున్న నమస్కారము. తిరిగి నీకు నమస్కారము.

నీ నెమలికి, నీ శక్తి అను ఆయుధమునకు నీ వాహనమగు గొర్రెపోతుకు, నీ కోడి పుంజుకు, నీ సముద్రమునకు, సముద్ర తీరమునకు నమస్కారము. ఓ స్కందుడా! నీకు మరల మరల నమస్కారము.

కుమారస్వామీ! నీ వాహన మగు నెమలికి, నీ ఆయుధమగు శక్తికి, నీకు, నీ మేకపోతునకు, నీ ధ్వజమగు కోడికి నమస్కారము. నీవు వసించు సింధు దేశమునకు,సముద్రమునకు నమస్కారము. మరొకమారు నీకు నమస్కారము.

32. జయానంద భూమం జయాపారధామం
జయామోఘకీర్తే జయానందమూర్తే

జయానందసింధో జయాశేషబంధో
జయ త్వం సదా ముక్తిదానేశ సూనో॥

ఆనందాతిశయము గలవాడా! గొప్ప తేజస్సు గలవాడా! గొప్ప యశస్సు గలవాడా! ఆనందరూపుడా! ఆనంద సముద్రుడా! ఎల్లవారికి బంధువైన వాడా! ఎల్లపుడు మోక్ష మొసంగు శివకుమారా! నీవు సర్వోత్కర్షచే నొప్పుదువు గాక!

ఆనందముతో నిండినవాడా! అపారమైన తేజస్సు కలవాడా! అమోఘమైన కీర్తి కలవాడా! సంతోష స్వరూపుడా! ఆనంద సముద్రుడా, అందరికీ బంధువైన వాడా! ముక్తి నిచ్చు ఈశ్వర పుత్రుడా! నీవు ఎల్లప్పుడు జయించుము.

ఆనందాతిశయము గలవాడా! గొప్ప తేజస్సు గలవాడా! గొప్ప యశస్సు గలవాడా! ఆనంద సముద్రుడా! అందరికీ బంధువైనవాడా! ఎల్లప్పుడూ మోక్షము నొసంగు శివకుమారా! నీవు అందరికంటే గొప్పవాడవై యొప్పుదువు గాక!

33. భుజంగాఖ్య వృత్తేన కౢప్తం స్తవం యః
పఠేద్భక్తి యుక్తో గుహం సంప్రణమ్య।
సుపుత్రాంకళత్రం ధనం దీర్ఘమాయు
తర్లభేత్స్కంద సాయుజ్యమంతే (నరః) సః॥

ఎవడు భక్తితో సుబ్రహ్మణ్యేశ్వరుని నమస్కరించి భుజంగ వృత్తముతో నున్న యీ స్తవమును పఠించునో ఆ మనుజుడు భార్యను, బిడ్డలను, ధనమును, దీర్ఘాయువును పొంది అంత్యకాలమున స్కంద సాయుజ్యము నొందు గాక!

భుజంగమను పేరుకల వృత్తము నందు రచించబడిన ఈ స్తోత్రమును ఎవడైతే గుహుని నమస్కరించి భక్తి కలవాడై పఠించునో అతడు పుత్రులను, భార్యను, ధనమును, దీర్ఘాయువును చివరిగా స్కంద సాయుజ్యమును పొందును.

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్

భక్తితో సుబ్రహ్మణ్యేశ్వరునికి నమస్కరించి భుజంగవృత్తముతో నున్న ఈ స్తవమును పఠించువాడు భార్యను, బిడ్డలను, ధనమును, దీర్ఘాయువును పొంది అంత్యకాలమున స్కంద సాయుజ్యము నొందుగాక!

//ఇతి శ్రీమచ్ఛంకర భగవతః కృతౌ శ్రీ సుబ్రహ్మణ్య భుజంగం సంపూర్ణమ్ //

- - - = - - -

స్వస్తి ప్రజాభ్యాం పరిపాలయన్తాం! న్యాయేన మార్గేణ మహీం మహీశాః!
గోబ్రాహ్మణేభ్యః శుభమస్తు నిత్యం! లోకాః సమస్తాః సుఖినోభవన్తు!!

- - - = - - -



Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్







(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)